క్లుప్తంగా

మహాత్మ ఆశ్రమ నిర్మాణానికి రూ.50 వేలు విరాళం



తెనాలి టౌన్: బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఇంజినీరింగ్ మహిళా కళాశాల సమీపంలోని మహాత్మ సేవా శాంతి ఆశ్రమ నిర్మాణానికి రూ.50 వేల విరాళాన్ని మంగళవారం పట్టణానికి చెందిన ధూళిపాళ్ళ వెంకటకృష్ణరావు అందజేశారు. ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి స్వగృహంలో నగదు చెక్కును అందించారు. తమ తల్లిదండ్రులు పుల్లయ్య, బసవమ్మ జ్ఞాపకార్థం ఆశ్రమం నిర్మాణానికి నగదు ఇచ్చినట్లు వెంకట కృష్ణారావు తెలిపారు.

భజన మాస్టర్ సాంబయ్యకు సన్మానం



తెనాలి అర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో మంగళవారం రామదాసు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. బుధవారం మిస్సమ్మ చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం భజన మాస్టర్ దానబోయిన సాంబయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాళహస్తి రఘు, కాజా శ్రీనివాసరావు, దేవతి తాండవ కృష్ణ, ధూపుగుంట్ల చంద్రశేఖర్, ఆళ్ల నాగు, గాండ్ల రాము, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఈదర శ్రీనివాసరావు, సోమవరపు సాంబశివరావు, ఎన్‌టీఆర్ జగన్, దేవిశెట్టి భాస్కర్, గుమ్మడి ప్రసాద్, ముళ్ళపూడి వెంకట్, నల్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వెల్‌నెస్ సెంటర్‌లలో అవగాహన సదస్సులు

తెనాలి టౌన్: రూరల్ మండలం కొలకలూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని గ్రామాల్లో మంగళవారం ఆరోగ్య సిబ్బంది హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. నేషనల్ హెల్త్ మిషన్, ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్‌వీ సుబ్బారావు తెలిపారు. రోగులకు బీపీ, షుగర్‌లపై అవగాహన కల్పించి పరీక్షలు జరిపి నెల రోజులకు సరిపడా మందులను అందజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ దిలీప్, హెచ్ఈఓ నాగరాజు, సూపర్‌వైజర్లు జి.శ్రీనివాసరావు, లక్ష్మీప్రసన్న, సుధారాణి పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

పిట్టలవానిపాలెం: మండలంలోని సంగుపాలెం కోడూరు గ్రామంలో మంగళవారం కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం ప్రత్యేక హోమాలు,పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక యాగశాలలో అర్చకులు పూజలు నిర్వహించారు. బుధ, గురువారాలలో విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

తగిన ఆహారపు అలవాట్లతో చక్కెరవ్యాధి నియంత్రణ

ఫిరంగిపురం: తగిన వ్యాయామం, ఆహారపు అలవాట్ల మార్పుతో చక్కెర వ్యాధి నియంత్రణలో ఉంటుందని ఎంఎల్‌హెచ్‌పీ స్వప్న అన్నారు. వేములూరిపాడు గ్రామంలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్లో జన్‌ఔషధి దివస్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎన్‌సీడీ సీడీలో భాగంగా ఇప్పటివరకు గుర్తించిన 30మందికి బీపీ, షుగర్ వ్యాధి పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

మంగళగిరి: నగరంలోని ఓ ప్రైవేటు యూనివర్సిటీ విద్యార్థులు కారు అతివేగంగా నడిపి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టారు. వాహనదారుడు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. మంగళవారం నగర పరిధిలోని నీరుకొండలో గల యూనివర్సిటీ విద్యార్థులు కారులో గుంటూరు అతివేగంగా వెళుతున్నారు. మార్గమధ్యలోని చినకాకాని జాతీయ రహదారి వద్ద ద్విచక్ర వాహనదారుడిని వెనుక నుంచి ఢీకొట్టారు. ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకుని స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ప్రమాదం జరిగిన వెంటనే విద్యార్థులు కారు నెంబరు ప్లేట్లను తొలగించి పెద్దలకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న వారు ద్విచక్ర వాహనదారునితో రాజీ చేసుకుని కేసు నమోదు కాకుండా తప్పించుకున్నారు.

భక్తులకు వైద్య సేవలు

మంగళగిరి: నగరంలో వేంచేసియున్న లక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణోత్సవం, దివ్య రథోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ వైద్యశాల, డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ల ఆధ్వర్యంలో పలు కూడళ్లలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు.

రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవానికి నాంది

- గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతం
- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: విశాఖపట్టణంలో ఇటీవల నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతం కావటం రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవానికి నాందిగా, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దార్శనికతకు, చిత్తశుద్ధికి నిదర్శనంగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. సమ్మిట్ విజయవంతమైనందుకు హర్షం వ్యక్తంచేస్తూ మంగళవారం మధ్యాహ్నం మున్సిపల్ కౌన్సిల్ హాలులో కేక్ కట్‌చేశారు. రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థతో విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్టు గుర్తుచేశారు. రాష్ట్రంలో ఎవరు ఏ కంపెనీ పెట్టినా స్థానికులకు 70 శాతం ఉద్యోగాలు ఇవ్వాలనే షరతును విధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కౌన్సిలర్లు తాడిబోయిన రామయ్య, గొడవర్తి సాయి హరేరామ్, బచ్చనబోయిన శ్రీనివాసరావు, కార్పొరేషన్ల డైరెక్టర్లు కావేటి నిర్మల, మన్నవ ప్రభాకర్, పార్టీ నేతలు దేసు శ్రీనివాసరావు, అడుసుమల్లి శ్రీనివాసరావు, తాడిబోయిన రమేష్, బూరెల దుర్గాప్రసాద్, కఠారి హరీష్, దేవరపల్లి కిషోర్, అక్కిదాసు కిరణ్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చేపల విక్రయించవద్దు

తెనాలి అర్బన్: చేపల విక్రయాలను బహిరంగ ప్రదేశాల్లో నిర్వహించవద్దని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వ్యాపారులకు సూచించారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఫిష్ మెండర్స్‌తో పాటు డిస్ట్రిక్ట్ ఫిషరిస్ విభాగ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిష్ ఆంధ్ర పేరిట ఆ క్వా హబ్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నదని, మొదటి విడత కింద గుంటూరు, తెనాలిలో వీటిని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా మత్స్యశాఖాధికారి వీవీఆర్ బాబు మాట్లాడుతూ ప్రజలకు మత్స్య సంపదను మరింత చేరువ చేసేందుకు ఆక్వా హబ్‌లకు ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. స్వయం ఉపాధిని కోరుకుంటున్న వారి కోసం ప్రత్యేక రాయితీలతో పథకాలను అమలు చేస్తుందన్నారు. వీటిని ప్రోత్సాహించేందుకు ప్రభుత్వం రుణాలను కూడా ఇప్పిస్తుందని తెలిపారు. అందరూ వీటిని ఉపయోగించుకోవాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కమిషనర్ ఎం.జశ్వంతరావు, ఎఫ్‌డీఓ ప్రసాద్, వీఏఎస్ అనూష, శివ పాల్గొన్నారు.

పెన్షనర్ల అసోసియేషన్ నూతన అంతస్తు ప్రారంభం

తెనాలి: స్థానిక కొత్తపేటలోని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో నూతనంగా నిర్మించిన గొర్నేని వేంకటేశ్వర్లు మెమోరియల్ హాలును ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్ల సంఘ భవనానికి పెండింగులో ఉన్న దారి సమస్యను త్వరలో పరిష్కరిస్తానని హామీ నిచ్చారు. సభకు యూనిట్ అధ్యక్షుడు మాచిరాజు రామకృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ మాట్లాడుతూ, పెన్షనర్లు తమ సొంత డబ్బు కోటి రూపాయలకు పైగా వెచ్చించి అసోసియేషన్‌కు మూడంతస్తుల భవనాన్ని నిర్మించుకోవటం హర్షణీయమన్నారు. దాతలను సత్కరించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభుదాసు, జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్లు మాలేపాటి హరిప్రసాద్, గుంటూరు కోటేశ్వరరావు, ట్రెజరీ అధికారులు శ్రీరామచంద్రమూర్తి, ఆలీ పాల్గొన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి బొమ్మదేవర వెంకటేశ్వరరావు, కోశాధికారి బెల్లంకొండ హృదయరాజు పర్యవేక్షించారు.

క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోండి

తెనాలి అర్బన్: క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని అధ్యాపకుడు డాక్టర్ పి.శివప్రసాద్ పేర్కొన్నారు. జేఎంజే కళాశాలలో మంగళవారం నిర్వహించిన క్రీడా దినోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తూ క్రీడలను విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శారీరక వ్యాయామం ఎంతో అవసరమని చెప్పారు. అనంతరం క్రీడ జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ షైనీ, ఫిజికల్ డైరెక్టర్ కె.అరుణ సుజాత పాల్గొన్నారు.

ఆశ్రమాల్లో వృద్ధులకు అన్నదానం

తెనాలి టౌన్: బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మ సేవా శాంతి ఆశ్రమం, నాజరుపేటలోని మన ఇల్లు వృద్ధాశ్రమం, గాంధీనగర్‌లోని షిరిడి సాయి వృద్ధాశ్రమంలో వృద్ధులకు రైల్వేస్టేషన్ వద్ద నిరుపేదలకు మంగళవారం శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. యోగ సభ్యులు కె.పుష్పకుమారి ఆధ్వర్యంలో గడ్డిపాటి ఓంకారప్రసాద్, హేమలత దంపతుల జ్ఞాపకార్థం సేవా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్వీయోగ కన్వీనర్ ఎం.రమణయ్య అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, మురళి, భారతి, కుర్రా శ్రీను, సుగ్గుల మల్లికార్జునరావు పాల్గొన్నారు.

లక్ష్మీతిరుపతమ్మకు పసుపు కుంకుమ

తెనాలి: పట్టణ రామలింగేశ్వరపేటలోని లక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్య స్వామి దేవస్థానంలో తిరునాళ్ల మహోత్సవం వైభవంగా నిర్వహించారు. 11వ వార్డు కౌన్సిలరు కఠారి రత్నకుమారి, వైఎస్సార్‌సీపీ నేత కఠారి హరీష్ దంపతుల ఆధ్వర్యంలో జరుగుతున్న తిరునాళ్ల సందర్భంగా మంగళవారం సాయంత్రం అమ్మవారు, స్వామివార్లకు పసుపు కుంకుమ సమర్పించారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరితోపాటు స్థానిక ముఖ్యులు బచ్చు రాఘవరావు, సముద్రపు సత్యం, కడియం నాగేశ్వరరావు, దూదిబండ్ల సాయి, నాగరాజు, మెండు కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా షోడశీ యతిపూజ



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కొత్త సుబ్రహ్మణ్యం

తెనాలి: పట్టణ కొత్తపేటలో శ్రీఅష్టలక్ష్మి అమ్మవార్ల జయంతి, రజతోత్సవ వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండోరోజైన మంగళవారం ఉదయం శ్రీఅష్టలక్ష్మి పీఠం సంస్థాపకులు దండి స్వాముల పర్యవేక్షణలో ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజాము నాలుగు గంటల్నుంచి అమ్మవారికి మహాభిషేకం భక్తిశ్రద్ధలతో శాస్త్రోక్తంగా చేశారు. అనంతరం తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో షోడశీ యతిపూజ ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల్నుంచి వచ్చిన యతీశ్వరులు షోడశీ యతిపూజలో పాల్గొన్నారు. శ్రీకాళహస్తి శుకబ్రహ్మాశ్రమం ఉత్తరాధికారి సంపూర్ణానందగిరి స్వాములు, నంబూరులోని శ్రీకాళీ వనాశ్రమం పీఠాధిపతి చంద్రకాళీ ప్రసాద మాతాజీ, హైదరాబాద్ పరాశరాశ్రమం నుంచి ఆచార్య పరిశుద్ధానందగిరి స్వాములు, శ్రీనివాస మంగాపురం శ్రీవశిష్ఠాశమం నుంచి స్వరూపానందగిరి స్వాములు, యల్లాయపల్లి చిన్మయా మిషన్ శ్రీలానంద మాతాజీతో పాటు పెదపులిపాక, గంగాపురం, రాజమహేంద్రవరం, ఉరవకొండ, లత్తవరం, ఇనమడుగు, తాడేపల్లి, కొక్కరచేడు, యాదగిరిగుట్ట, బళ్లారి, చింతపల్లి నుంచి యతీశ్వరులు పూజల్లో పాల్గొన్నారు. కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం జ్యోతిప్రజ్వలన చేసి పూజ కార్యక్రమాలను ప్రారంభించారు. బుధవారం మహాకుంభాభిషేకం, సహస్ర నామార్చన, అన్నప్రసాద వితరణ ఉంటాయని తెలిపారు. ఉత్సవాల్లో మధ్యాహ్నం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు. దండి స్వాముల ఆశీస్సులు తీసుకున్నారు. పీఠాధిపతులు తీర్థప్రసాదాలు అందజేశారు.

'మధురకవి' నూతక్కి అబ్రహాం చిరస్మరణీయుడు



అబ్రహాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

తెనాలి: అక్షరం ఉన్నంతవరకు అబ్రహాం చిరంజీవిగా ఉంటారని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ పొన్నెకంటి రత్నాకర్ అన్నారు. జాతీయ అంబేడ్కర్ అవార్డు గ్రహీత 'మధురకవి' నూతక్కి అబ్రహాం జయంతిని రూరల్ మండలం కొలకలూరులోని పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. రత్నాకర్ మాట్లాడుతూ గుర్రం జాషువా ప్రథమ శిష్యుడిగా నూతక్కి అబ్రహాం 40 పైగా కావ్యాలు రాశారని చెప్పారు. కవికోకిల, మధురకవిగా సాహిత్య చరిత్రలో స్థానం సంపాదించారని వివరించారు. గ్రామ సర్పంచి చొప్పర ప్రీతి మాట్లాడుతూ సాహితీ, కళా రంగాల్లో విలసిల్లిన కొలకలూరులో అందుకు కారకుల్లో అబ్రహాం ఒకరని అన్నారు. అబ్రహాం రాసిన కావ్యాల్లో 'మత్కుణం' గొప్పదన్నారు. అంతటి సాహితీవేత్త జయంతిని పంచాయతీ కార్యాలయంలో జరుపుకోవటం సంతోషంగా ఉందన్నారు. యూనియన్ బ్యాంక్ మేనేజరు రంజిత్‌కుమార్ మాట్లాడుతూ గ్రామానికి పేరుతెచ్చిన సాహితీవేత్తలు, కళాకారులను గుర్తు చేశారు. నూతక్కి ఆచారి పాల్గొన్నారు.

మహిళలు ఆత్మస్థైర్యంతో రాణించాలి

- జెడ్పీటీసీ సభ్యురాలు ఉమాప్రణతి




మహిళ సాధికారత అవార్డును హెచ్‌ఎం శోభాదేవికి అందజేస్తున్న జెడ్పీటీసీ ఉమాప్రణతి

తెనాలి టౌన్: మహిళలు ఆత్మస్థైర్యంతో రాణించాలని జెడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమాప్రణతి పేర్కొన్నారు. రూరల్ మండలం కొలకలూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పేరెంట్స్ కమిటీ చైర్మన్ పినపాటి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. సభకు కల్చరల్ సెక్రటరీ మత్తె అన్నారావు స్వాగతం పలుకగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.శోభాదేవి అధ్యక్షత వహించారు. సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉమాప్రణతి మాట్లాడుతూ మహిళలు వ్యాపారులుగానూ, రాజకీయవేత్తలగాను, ఉద్యోగులుగాను సమాజంలో రాణిస్తున్నారని, మహిళలను గౌరవించాలని కోరారు. హెచ్‌ఎం శోభాదేవి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందజల్లో ఉండాలని, ఆడపిల్లలు విద్యలోనూ, నైతికగానూ, మానసికంగా బలవంతులని, నైతిక విలువలతో కూడిన మంచి విద్యను అభ్యసించాలని పేర్కొన్నారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ అనిల్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు.
మహిళలను గౌరవించాలని కోరారు. రూరల్ డెవలెప్‌మెంట్ ట్రస్ట్ (అనంతపురం) ఏరియా టీమ్ లీడర్ రామాంజనేయులు మాట్లాడుతూ స్పందించూ–సహాయం అందిచూ అనే కార్యక్రమాన్ని ట్రస్ట్ ద్వారా చేపట్టి తల్లిదండ్రులు చనిపోయిన పిల్లలను అదుకుంటున్నామని, వారిని విద్యను అందిస్తున్నామని తెలిపారు.
ఈ సందర్భంగా రూ.40వేలు విలువగల ఆట పరికరాలను పాఠశాలకు అందించారు. సభలో 2023 మహిళా సాధికారత అవార్డును స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఎస్.శోభాదేవికి అందజేసి శాలువాలు, పూలమాలలను జ్ఞాపికలతో సత్కరించారు. పాఠశాలలో పనిచేస్తున్న మహిళ ఉపాధ్యాయులను, సిబ్బందిని శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. తొలుతగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో ఆర్‌బీటీ ప్రతినిధి సౌజన్య, సీఆర్‌టీ నాగవేణి, వ్యాయామ ఉపాధ్యాయులు టి.నాగయ్య పాల్గొన్నారు.

సస్యరక్షణ పాటిస్తే అధిక దిగుబడులు

- వ్యవసాయశాఖ డీడీఏ విజయనిర్మల



ముత్తాయపాలెంలో మినుము పైర్లను పరిశీలిస్తున్న డీడీఏ విజయనిర్మల

బాపట్ల టౌన్: అపరాల సాగులో సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ డీడీఏ విజయనిర్మల తెలిపారు. మండలంలోని ముత్తాయపాలెంలో సాగులో ఉన్న మినుము, రాగులు, పెసర, వేరుశనగ పైర్లను మంగళవారం పరిశీలించారు. డీడీఏ విజయనిర్మల మాట్లాడుతూ మినుము సాగులో నీరు నేరుగా పొలానికి పెట్టడం వలన తేమ అధికమై పైర్లు దెబ్బతిన్నాయని చెప్పారు. మినుము, పెసర, వేరుశనగ పైర్లకు నీటి తడులను తుంపర పద్ధతిలో, బోదెల ద్వారా మాత్రమే అందించాలని సూచించారు. నేరుగా పెట్టాల్సి వస్తే మోటారు సహాయంతో తడిపి వెంటనే తీసి వేయాలన్నారు. తేమ ఎక్కువైతే పైర్లు తీవ్రంగా నష్టపోతాయన్నారు. బెట్టకొచ్చిన మినుము పైర్లకు 13–0–45 (మల్టీకె) ఎకరానికి కేజీ చొప్పున పిచికారీ చేయాలన్నారు. రాగి సాగులో ప్రస్తుతం అగ్గి తెగులు, కాండం తొలిచే పురుగుల ఉధృతి అధికంగా ఉందని, దీని నివారణకు ఎకరాకు ట్రైసైక్లోజోల్ 120 గ్రాములు, క్లోరిపరిపాస్ ఎకరాకు 500 మి.లీ చొప్పున పిచికారి చేయాలన్నారు. పొలాలను పరిశీలించిన వారిలో శాస్త్రవేత్త సాంబశివరావు, ఉప్పునీటి పరిశోధన స్థానం శాస్త్రవేత్త మృదుల, ఏడీఏ ఎ.లక్ష్మి, ఏఓ కె.శారద పాల్గొన్నారు.

డాక్టర్ జీవనలతకు ఉమెన్ స్పాట్‌లైట్ అవార్డు



డాక్టర్ జీవనలతకు అవార్డు అందజేస్తున్న వాసిరెడ్డి పద్మ

తెనాలి: పట్టణానికి చెందిన ప్రభుత్వ వైద్యురాలు, రెయిన్‌బో ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ డి.జీవనలతకు 'ఉమెన్ స్పాట్‌లైట్ అవార్డు–2003' లభించింది. స్పృహాప్తి చారిటబుల్ ట్రస్ట్, రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ ఆధ్వర్యంలో ఉమన్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ సిద్ధార్థ మహిళా కాలేజ్‌లో మహిళా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎస్‌డీఎం సిద్ధార్థ మహిళా కాలేజ్‌లో మధ్యాహ్నం నిర్వహించిన ఈ వేడుకల్లో ముఖ్యఅతిథి ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ చేతులమీదుగా ఎనిమిది మంది విశిష్ట మహిళలకు ఉమెన్ స్పాట్‌లైట్ అవార్డు–2023లను ప్రదానం చేశారు. వీరిలో తెనాలికి చెందిన డాక్టర్ జీవనలత ఉన్నారు.

సాయిబాబా సత్సంగ కేంద్రం వార్షికోత్సవం



సత్సంగ కేంద్రంలో పూజలు నిర్వహిస్తున్న నారాయణమూర్తి తదితరులు

తెనాలి టౌన్: రూరల్ మండలం అంగలకుదురులోని సాయిబాబా సత్సంగ కేంద్రం వార్షికోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 4.30గంటల నుంచి సాయిబాబా నామంతో గ్రామ సంకీర్తన జరిపారు. అనంతరం హారతి, సత్సంగం నిర్వహించారు. డాక్టర్ నూరి నారాయణమూర్తి భక్తులనుద్దేశించి ప్రవచనం చేశారు. అనంతరం ఉత్సవ చిత్రాన్ని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అన్నప్రసాద వితరణ చేశారు. సత్సంగ కేంద్ర వ్యవస్థాపకులు బుల్లారెడ్డి, సాంబశివరావు పర్యవేక్షించారు.

చందోలులో ఘనంగా హరిద్ర శృంగార్చన

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలోని బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి పాల్గొన్నారు.

వ్యాన్ బోల్తా పడి వ్యక్తి మృతి

జంపని(వేమూరు): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ చోడయ్య తెలిపిన వివరాలు.. గుంటూరు జిల్లా తెనాలి పట్టణానికి చెందిన కంకణాల సాయికుమార్, కొల్లూరు మండలం దోనేపూడిలో ఈ నెల 9న నిర్వహించనున్న తిరునాళ్ల వ్యాపారం కోసం చేసుకునేందుకు అవసరమైన సామగ్రి వ్యాన్‌లో తీసుకెళ్తున్నాడు. జంపని చెరువు మలుపు వద్ద వ్యాన్ అదుపు తప్పి బోల్తాపడింది. కంకణాల సాయికుమార్(25) తీవ్రంగా గాయపడ్డాడు. 108లో తెనాలి ప్రభుత్వం వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పూరిల్లు దగ్ధం

కర్లపాలెం: ప్రమాదవశాత్తు ఓ పూరిల్లు దగ్ధమైన ఘటన మండల పరిధిలోని దుండివారిపాలెంలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. వీఆర్వో శివ నాగేశ్వరరావు తెలిపిన వివరాలు.. దుండివారిపాలెం పంచాయతీ అక్కిరాజు దిబ్బ ఎస్టీ కాలనీలో నివాసం ఉంటున్న కడలి సాయికృష్ణ భార్య తమ పూరింట్లో వంట చేసిన అనంతరం ప్రమాదవశాత్తు మంటలు ఎగసి పూరి గృహం దగ్ధమైందని తెలిపారు. ఇంటితో పాటు వంట పాత్రలు, దుస్తులు కాలిపోవటంతో రూ.70వేల ఆస్తి నష్టం జరిగిందని ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని వీఆర్వో తెలిపారు.

గంజాయి స్వాధీనం

నిజాంపట్నం: గంజాయి అమ్ముతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరు పరిచినట్లు రేపల్లె రూరల్ సీఐ ఎ.శివశంకర్ తెలిపారు. వివరాలు.. నిజాంపట్నంలో గంజాయి అమ్మకాలు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో సీఐ శివశంకర్, నిజాంపట్నం ఎస్ఐ రమేష్ దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 1.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు దేవర నాగరాజు, చింతా ఏడుకొండలు, మోపిదేవి మణికంఠపై కేసు నమోదు చేశారు.

కొల్లూరులో లారీ చోరీ..

ఆయిల్ లేకపోవడంతో వదిలి వెళ్లిన దొంగలు

కొల్లూరు: రోడ్డు పక్కన నిలిపి ఉంచిన లారీ చోరీకి గురైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కొల్లూరుకు చెందిన లారీని స్థానిక ఈపూరు చిన కాల్వకట్టపై సోమవారం రాత్రి నిలిపి ఉంచారు. అర్ధరాత్రి దాటిన అనంతరం గుర్తు తెలియని వ్యక్తులు నిలిపి ఉంచిన లారీని చోరీ చేసి తరలించుకుపోయారు. మంగళవారం ఉదయం నిలిపి ఉంచిన ప్రాంతంలో లారీ కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన యజమాని, డ్రైవరు చుట్టు పక్కల ప్రాంతాలలో గాలింపు చేపట్టారు. ఆయిల్ అయిపోయి పెదకొండూరు సమీపంలో నిలిచిపోవడంతో అక్కడే వదిలి వెళ్లిపోయినట్లు లారీ గుర్తించారు. లారీ చోరీపై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ శామ్యూల్‌రాజీవ్‌కుమార్ తెలిపారు.

సుస్థిర సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

పిట్టలవానిపాలెం: సుస్థిర సేంద్రియ వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని జెడ్‌బీఎన్ఎఫ్ ఆక్టివిస్ట్ ఎం.వరదానం తెలిపారు. మండలంలోని అల్లూరు గ్రామంలో మంగళవారం సుస్థిర సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి ఉప్పు చెంచులక్ష్మి, శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ట్రస్టు బోర్డు చైర్మన్ వాలి వెంకటశివారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు వాలి కృష్ణకుమారి పాల్గొన్నారు.